# నందనవనం - 12

భద్రయ్య వెళ్ళిపోయాక... ఆయన శ్రీవల్లితో అతని ఆత్మీయతను గురించి ఆనందంగా మననం చేసుకుంటున్నపుడు... శ్రీవల్లి మెల్లగా అంది ''ఏమిటో సరిగా తెలియటం లేదుగానీ... అతని వాలకంలో రవ్వంత తేడా ఏదో ఉన్నట్లనిపించింది. ఇల్లంతా ఇష్టంగా చూస్తున్నట్లుగానూ ఉంది... డేగ చూపులతో పరిశోధిస్తున్నట్లు గానూ ఉంది...!''

''నీవే అసలు డేగకళ్ళు....! కల్మషం లేని ఆయన మాటల్లో.. ఏదో పసిగట్టాలన్నట్లు చూసావేమో..!'' అంటూ ఆయన చిన్నగా నవ్వాడు.

''ఏమో... అయి వుండొచ్చు...! ఎందుకంటే... ఆయన నేను వడ్డించిన వంకాయ పచ్చడిని రుచి చూడకుండానే 'బాలా బావుందని' మెచ్చుకోవటాన్ని చూసి నాకీ అనుమానం వచ్చింది. పూర్తిగా తిననక్కర్లేదు... వేలితో నాలుకకి రాసుకుని అయినా రుచి చూసి చెప్పి ఉంటే... నాకూ నిజమేననిపించి సంతృప్తి కలిగేది!''

''అలా ఎందుకనుకోవాలీ.. ? కొన్నింటి రుచి చూడాల్సినవసరం లేకుండానే ఆకారాన్ని బట్టీ చెప్పగలం ! అవునా..?''

ఆయన ప్రశ్నకి ''అవును ... అదే అయివుంటుంది...!'' అంది చిరునవ్వుతో.

''అదే కాకుండా, ముందుగా రుచి చూసిన వంటకాలను బట్టి... పచ్చడి రుచినీ అంచనా వేసి ముందుగానే ఆకారం నచ్చటంతో అలాగూ చెప్పి ఉండొచ్చుగా..!''

‘‘అవును మీరన్నదీ నిజమే...!’’ అని శ్రీవల్లీ అంగీకరించింది.

పైకి కనిపించే ఆప్యాయతకీ, ఆయనలోని అసలు రూపానికీ సంబంధం వేరేగా ఉండొచ్చని తనకీ అనిపించిన మాటని పైకి అనకుండా మనసులోనే దాచుకున్నాడాయన. కారణం సరిగా తెలియనపుడు వ్యక్తపరచడం అనవసరమనిపించింది.

* * *

రామం ఇంటికి వచ్చాక శ్రీవల్లి సరదాగా భద్రయ్య వచ్చి వెళ్ళిన సంగతీ, తమ అభిప్రాయాలూ అన్నీ ఏకరువుపెట్టింది.

రామం పకపక మన్నాడు. ‘‘నేను కూడా అపుడపుడూ మొహమాటానికి అలా చెప్పేస్తూ ఉంటాను. మర్యాదగా ఉంటుందని అంతేకదా... దీనికి నిజా నిజాల ప్రసక్తి కూడా ఎందుకూ... అంత అవసరం లేదు! ఏదో సామెతలా... పనిలేక పెట్టుకున్న ప్రోగ్రాంలా ఉంది...!’’

శ్రీవల్లి నిష్ఠూరం చూపించింది. ‘‘అవునవును.... నువ్వు మాత్రం ఏదో ఉపయోగకరమైన పనులతో పొద్దంతా తిరుగుతున్నావ్... మేమిద్దరం ఏం చేయాలో తోచక ఇలా ఈకలు పీకే పని పెట్టుకుంటున్నాం !’’

‘‘ అంత మాట నేనెందుకంటానమ్మా... వీరిద్దరూ చేస్తున్న దాని ముందు.. నాదెంత..! ఇంటిపనే కాకుండా, స్టోరు అజమాయిషీ, ఊళ్ళో వాళ్ళందరికీ హితబోధలూ, నీతికథలూ ఆపైన పొలం పనులూ...’’

‘‘ అబ్బ..! ఇక ఆపరా నీ దండకం...!’’ అంది శ్రీవల్లి కోప్పడుతున్నట్లుగానూ, చిరునవ్వుతోనూ. అందరూ సరదాగా నవ్వుకున్నారు.

* * *

తలక్రిందుగా రెండు చేతులూ పెట్టుకుని ఏదో ఆలోచనలో ఉన్నట్టుగా పైకి చూస్తూ మంచం మీద పడుకున్న ఉన్న ఆయనని ‘‘ఏమిటంత ఆలోచన...?’’ అంటూ శ్రీవల్లి పలకరించింది.

సమాధానం రాకపోయేసరికి ఆవిడ మెల్లగానే మళ్ళీ అడిగింది. అప్పుడూ జవాబు లేదు.

చిరాకొచ్చి కొంచెం నిష్టురంగా అడిగింది.

అప్పుడాయన తృళ్ళిపడినట్లుగా ‘‘ఏమన్నావూ....?’’ అని అడిగే సరికి నిష్ఠూరం ఇంకా పెరిగింది. అది మాటల్లోకీ వచ్చింది. ‘‘ఆ మధ్య మనింటికి వచ్చినాయనతో మాటల సందర్భంగా.... మీరూ ‘మా ఆవిడ వాగుడుకాయ, నేను వూగుడు కాయనీ’ అంటే ‘వూగుడు కాయంటే ఏమిటండీ, ఆ మాట నేనెప్పుడూ వినలేదూ?’ అని అడిగాడా?’’ అంది శ్రీవల్లి.

‘‘అయితే... ఏమిటి..? ఇపుడెందుకు గుర్తుకు వచ్చిందీ...?’’ ఆయన విస్తుపోయాడు. తర్వాత ఒక క్షణం ఆలోచించి... ‘‘అవును.. ఆయనలా అడిగితే, నేను ‘వూగుడు కాయ అంటే... ఆవిడగారు చెప్పే మాటలన్నింటినీ తలకాయ వూపుతూ అవునంటానూ అందుకనీ...’ అని చెప్పాను. నువ్వు విని పెద్దగా నవ్వావు కూడా..! నేనేం మర్చిపోలేదు. ఎందుకిపుడు నీకు గుర్తుకు వచ్చిందీ అనేదే నా ప్రశ్న...!’’ అనడిగాడు.

‘‘ఆడవాళ్ళదే ఆధిపత్యం అని మగవాళ్ళంతా వేళాకోళం చేస్తూంటారు. వాస్తవానికేమో మాటను ఎన్నిసార్లడిగినా కూడా వినబడనట్లుగా మౌనం....! పైగా అందరితోనూ నా మాటలకు తలవూపటమే మీపని అంటూ ప్రచారం..!’’ శ్రీవల్లి కోపం నటించింది.

‘‘నాకు నిజంగానే వినిపించలేదు మరి... నా ఆలోచనంతా పొలం గురించే....!’’

‘‘అలవాటులేని పని కదా కష్టంగా ఉంటుంది! దిగితేగానీ లోతు తెలియదు అంటారందుకే.. కొంచెం దిగగానే మీకూ అర్థమైంది !’’ అంది శ్రీవల్లి నిట్టూరుస్తూ..

‘‘శారీరక కష్టం అలవాటు లేదని నువ్వనుకుంటున్నావు గానీ నేను దేనికైనా సిద్ధపడగలనని నా నమ్మకం ! నా ఆలోచన అంతా నా గురించే కాదులే, అందరి రైతుల సమస్యలు తెలుసుకోగలుగుతున్నా కదా... సంవత్సర కాలమంతా కష్టపడి పండిరచిన పంట ఇంటికి చేరాక రైతుకు ఎంత ఆనందంగా ఉంటుందో... ఏ ప్రకృతి వైపరీత్యం వలనైనా దక్కకపోతే... అంత కష్టంగానూ ఉంటుంది..! ఆపైన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవటం.. శ్రమకు తగ్గ ఫలితం దక్కకపోతే... ఎవరికైనా అంతేగా!’’ అన్నాడాయన, కంఠంలో వేదన సుళ్ళు తిరిగింది.

శ్రీవల్లీ అవునన్నట్లు తలవూపుతూ నిట్టూర్చి ‘‘వ్యవసాయంలోనే కాదు, అన్ని వ్యాపారాల్లోనూ కష్టసుఖాలు, లాభనష్టాలు అంటూ ఉంటూనే ఉంటాయిగా...’’ అంది.

‘‘అవుననుకో... కానీ నాకు మాత్రం ఇపుడే రైతుల సమస్యలు బాగా తెలిసి వస్తున్నాయి...! ఎలా వీటిని అధిగమించాలీ, ఎలాంటి సూచనలూ, సలహాలూ తీసుకోవాలీ... ఏమిటో.. ఇలా రకరకాల ఆలోచనలు ... తెగటం లేదు...!’’

‘‘అంటే.. రైతు బడి లాంటిదేమైనా ఏర్పాటు చేయాలనే ఆలోచనా...?’’ వ్యంగ్యమో, నిజమో తెలియనీయకుండా అంది శ్రీవల్లి.

“అలాంటిదేం లేదు. అసలు రైతులకు తగిన సూచనలు, ఎరువులూ వాటి గురించి చెప్పటానికి చాలామంది.... వ్యవసాయ శాస్త్రం చదివిన ఆఫీసర్లూ ఉన్నారు. భీమాపథకాల్లాంటివీ ఉన్నాయి... వాటి గురించి కాదులే....’’

‘‘మరి....?’’ శ్రీవల్లి వదనం పైకి ప్రశ్న వచ్చి కూర్చుంది.

‘‘మనం ప్యాక్టరీ కోసం స్థలం సేకరించామా... ఫాక్టరీ కాకుండా.. ఏదైనా ఈ ఊరు రైతులకు పనికొచ్చే విధంగా... అంటే... పంటలను నిలువచేసుకునే కోల్డ్ స్టోరేజి లాంటిదైతే... బావుంటుందేమోననిపిస్తోంది...!

శ్రీవల్లి చిన్నగా నవ్వింది. ‘‘ముందు హాస్పటల్ అనుకున్నారు. కొంచెం దగ్గర ఊరు ఆనందపురంలో ఉంది కదాని ఆ ఆలోచన విరమించుకున్నారు. తరువాత ఏదో పరిశ్రమ అంటూ పరమేశ్వరం గారితోనూ చర్చించి స్థలం సేకరించగలిగారు! అదంతా వాళ్ళవల్లే సానుకూలమైంది కాబట్టి.... ఏ మార్పు గురించి అయినా ముందుగా వాళ్ళతోనూ చర్చించాలి! అవునా...? మీ ఆలోచనలన్నీ రామంతో చెప్పండి. ఇంకా పేపరు వర్కు లాంటిది, మొదలు పెట్టే దశలోనే ఉన్నారు కనుక ఏదైనా అందరూ ఆలోచించుకొని చేసే వీలు ఉంటుంది...!’’

‘‘అవును ... ఏదో ఒక నిర్ణయానికి రావాల్సిందే..! మీరేమో అనుకున్నదే తడవుగా మాల్ లాంటిది ఏర్పాటు చేసేసి.. చక్కగా నడిపిస్తున్నారు! మాకేమో ఆలోచనే పూర్తికావటం లేదు.. నిలకడ లేదు..!’’ అన్నాడాయన నిట్టూరుస్తూ.

‘‘మీ అందరూ తలా ఒక చేయి వేయబట్టేగా వీలైంది... ఏ పని అయినా ఒక్కరి వల్లే కంటే... నలుగురు కలిస్తేనే సులువవుతుంది...! కొన్ని పనుల్లో మనిషికి మనిషి సాయం తప్పని సరి! నలుగురి సలహాలూ తీసుకుని... ఆలోచించుకుని ఏదైనా మనమే నిర్ణయించుకోవాలి. అప్పుడు కష్టమైనా నిష్టూరమైనా మనమే బాధ్యులమౌతాం... ఎవరినీ నిందించే అవసరం, అవకాశం ఉండదు...!’’

‘‘అవునండీ... లచ్చిందేవీ.... బాగా అర్ధమైంది!’’ అంటూ ఆయన చిరునవ్వు చిందించాడు. సరదాగా శ్రీవల్లీ నవ్వేసింది.

‘‘నీ మాటల్ని బట్టి నాకో సందేహం వచ్చింది. మాల్ ఏర్పాటులో మా అందరి సాయం ఉందన్నావా... లేక మా సలహాలు తీసుకుని, ఆఖరుగా ఏర్పాటును మీరే నిర్ణయించుకున్నామని చెప్పావా..?’’ ఆయన మాటల్లో పరిహాసం లేదని నిర్ణయించుకుని శ్రీవల్లి చెప్పింది. ‘‘రవళి తను బాగా చదువుకోకపోవటం వలన ఉద్యోగం చేసి సంపాదించు కోలేక పోతున్నాననుకున్నపుడు... ఈ ఆలోచన వచ్చింది! ఆచరణలో పెట్టటానికి మీ అందరి సాయం అవసరమైంది. అంతేగా?’’

ఆయన ఏదో ఆలోచన నుండి ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్థిరంగా చెప్పేసాడు.

‘‘నేను కోల్డ్ స్టోరేజి పెట్టటమే బావుంటుందనే నిర్ణయానికి వచ్చేసాను! పరమేశ్వరం గారు కాదంటే... అపుడు నేనే ఏర్పాటు చేసే ఆలోచన చేస్తాను.... ఎవరూ కలిసిరాకపోయినా సరే...!’’

‘‘కాదన్నదెవరూ..? అలాగే కానివ్వండి!’’ అంది శ్రీవల్లి. మళ్ళా చురుగ్గా చూసి..‘‘పొలం పనులకి బయలుదేరేవాళ్ళు.... పొద్దు పొద్దున్నే ఇలాంటి కబుర్లు కాలక్షేపాలూ పెట్టుకుంటారా...?’’ అనడిగింది.

''అవును కదూ....'' అంటూ ఆయనా చకచకా తన పనులన్నీ ముగించుకుని పొలానికి బయలుదేరాడు. పంచెకట్టు వేషంలో ఆయనను చూసిన ప్రతిసారీ శ్రీవల్లికి ముసిముసి నవ్వులు రువ్వటం అలవాటు.

ఆయన పైపంచె సవరించుకుంటూ బయలుదేరుతున్నపుడు సూర్యం ఎదురొచ్చాడు. శ్రీవల్లి సూర్యాన్ని చూసి ''ఏమిటీ.. కాలేజీలు తెరిచారని విన్నానే... నువ్వు వెళ్ళలేదా...?'' అని ఆప్యాయంగా అడిగింది.

సూర్యం చిరునవ్వుతో బదులు చెప్పాడు ''సరిగ్గా ఈ రోజు ఉదయమే మా అమ్మ ఇలాగే అడిగింది 'ఎప్పుడూ కాలేజి తెరవటానికి కొంచెం ముందుగానే పరుగులు పెట్టేటోడివి.... ఇపుడు తెరిచినా ఇంకా వెళ్ళటం లేదేంట్రా...?' అని ఓ సలహా కోసమే ఇటు వచ్చానండీ..'' అన్నాడు.

సూర్యం భుజంపై ఆయన చెయ్యి వేసి ''అయితే పద... అలా పొలం వైపు వెళ్తూ మాట్లాడుకుందాం'' అంటూ సూర్యాన్నీ బయలు దేరదీశాడు.

''నీ సలహా చదువు గురించేగా...? చదువు పూర్తి చేయాల్సిందే... ఇంకో ఆలోచన మాత్రం చేయకు. మీ అమ్మ నాన్నల లాగే నేనిచ్చే సలహా కూడా ఇదే. చదువంటే.... నీ ఆలోచనలను పదును పెట్టగల ఆయుధమనుకో.. ఎటువంటి కష్టనష్టాలు వాటిల్లినా తట్టుకోగలిగే ధైర్యాన్నివ్వగలదు!'' అంటూ ఇంకా ఏదో చెప్పబోతూండగానే సూర్యం మధ్యలో నసుగుతూ అన్నాడు...''మీరు చేసే పనిలో పాలు పంచుకోవాలనీ...''.

''నీ సాయం అవసరమైనప్పుడు.. నేనే నిన్ను పిలుస్తాను. ఏం సందేహించను! అప్పటి వరకూ చదువు కొనసాగించు. అప్పటికి నీకో అభిప్రాయమూ ఏర్పడవచ్చు.

దాని ప్రకారం నిర్ణయించుకుందువుగానీ... ఇదేకదా నీకు మీ అమ్మా నాన్నలూ చెప్పిందీ..?''

అవునన్నట్లు సూర్యం తలవూపాడు.

''మేం ఏం చేస్తామో, ఏం చేయగలమో అన్నది పూర్తిగా తెలనే లేదు! ముందుగా ఇదిగో ఈ వ్యవసాయం మాత్రం మొదలు పెట్టాం. ఎలాంటి కష్టనిష్ఠూరాలు ఎదురవుతాయో ఎలా తట్టుకుంటామో - ఏమీ తెలియదు!'' మాటల్లోనే పొలం దగ్గరకు చేరారు ఇద్దరూ.

''ఒక్క మాట మిమ్మల్ని అడగనా...?'' సూర్యం అడగ్గానే కొంచెం ఆశ్చర్యంగా చూసి ''ఒక్క నిమషం ఉండు..'' అంటూ అటువైపు చకచగా అడుగులు వేస్తూ వెళ్ళాడాయన. అప్పటికే వచ్చినవాళ్ళకి పనులు పురమాయించి గట్టున ఉన్న ఓ చెట్టు నీడన సూర్యం పక్కగా చతికిలబడి ''సరే, ఇపుడు చెప్పు సూర్యం తాపీగా మనం మాట్లాడుకోవచ్చు...!'' అన్నాడు.

''నాకపుడపుడూ ఓ సందేహం వస్తూనే ఉంటుంది... మీరు... అంత దూరం నుండి... నగర జీవనానికి అలవాటు పడిన వాళ్ళు...ఈ మారు మూల పల్లెకు.... మీ తాతగారి ఊరు, ఆయన ఉన్న ఇల్లు అనే మమకారంతోనే వచ్చారా అని ఈ ఆశ్చర్యంతో పాటు ఇంకో కారణం ఏమైనా ఉందా అనే అనుమానమూ కలుగుతూ ఉంటుంది..! ఉండబట్టలేక ఇపుడు అడిగేసా...!'' అన్నాడు సూర్యం మెల్లగా నసుగుతూనే.

ఆయన ఫక్కున నవ్వేసి ''ఏదైనా సంశయం వస్తే... అడిగితేనే మనసు తేలికవుతుంది.... లేకపోతే అర్థం పర్థం లేని ఆలోచనలతో బరువెక్కుతుంది!'' అంటూ ''సరే... వివరంగానే జవాబు చెబుతా''నన్నాడు.

''మా నాన్నకు ఈ ఊరు పట్ల చెప్పలేనంత మమకారం ఉంది! చిన్నతనంలో తను తిరిగిన ఈ ఊరు, వీధులు, చెట్లు, చేమల గురించి కబుర్లు చెప్పేటప్పుడు... నాన్న కళ్ళు ఆ జ్ఞాపకాలతో ఎంత మిలమిలాడి పోతాయో... నిజానికి ఎవరికైనా స్వంత ఊరు, బాల్యస్మృతులూ మధురమైనవే....! అయితే కొందరికి మాత్రం కొంచెం ఎక్కువ మక్కువని నాకనిపిస్తూ ఉంటుంది! ఎందుకంటే... మా చిన్నతనంలో మేం చాలా

ఊళ్ళు తిరిగాం. ఆరోజుల్ని జ్ఞాపకం చేసుకుంటే, సరదాగా బావుంటుంది గానీ మా నాన్నకు కలిగేంత ఉత్తేజం మాత్రం మాకు కలగదు! అందుకనే ఈ మాటను చెప్పగలిగాను!

నా చిన్నపుడే... నా పేరు గురించి ఓ సారి మా నాన్నతో అన్నా. 'తాతగారి పేరు యధాతధంగా పెట్టటం బావుండదని, పెద్దయ్యాక పాతకాలం పేరని నేను బాధపడతానేమోననే ఉద్దేశ్యంతో ఇలా కొంచెం ఆధునికంగా మార్చి పెట్టావుకదా నాన్నా.... అనడిగి, నాకా పేరన్నా ఇష్టమే ననిచెప్పా.

దానికి మా నాన్న నవ్వి... 'తాతగారి పేరు మార్చి పెట్టటానికి కారణం నువ్వనుకున్నది కాదు, అసలు కారణం ఏమిటో చెప్పనా... అంతటి గొప్ప వ్యక్తి పేరు పెట్టుకోగలిగిన అర్హత నీకు ఉందో లేదోననే అనుమానం వచ్చి అలాగే పెట్టే సాహసం చేయలేక కొంత మార్చానన్నమాట! అంతేగానీ ఫ్యాషన్‌గా ఉండాలని కాదు! పెద్దయ్యాక... ఆయన పేరు నిలబెట్ట గలిగే వ్యక్తిత్వం కలవాడివవుతావో లేదో ముందుగానే తెలియదుగా ఎవరికీ!' అనేసరికి ... నాక్కొంచెం చిన్నతనమనిపించింది !

'మీ నాన్నేమైనా గాంధీలాంటి గొప్పవ్యక్తా...? అలాంటి వాళ్ళ పేర్లే చాలా మంది పెట్టుకోవటం లేదా?' అని పౌరుషంగా చూసా. ''కొందరు గొప్ప వ్యక్తులు చేసిన గొప్ప

పనులు, త్యాగాల వలన చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతారు! వారి జీవిత చరిత్రలనూ పాఠాలుగా చదువుకుంటాం.... చెప్పుకుంటాం ! కొందరు సామాన్యవ్యక్తుల్లో ఉండే ఆసామాన్య ప్రతిభ, వ్యక్తిత్వం వలన.. వాళ్ళతో పరిచయం కలిగిన లేదా సాయం పొందిన మనుష్యుల గుండెల్లో... జ్ఞాపకాల్లో వాళ్ళు చెదిరి పోకుండా ఉండిపోతారు!

'అరుగులబడి అయ్యవారుగా' పేరుపొందిన మీ తాతగారూ ఆ కోవలోని వారే. ఇపుడు కొందరు పెద్దలు చెబుతున్నట్లే.... ఆరోజుల్లోనే ఆయన విద్య, వైద్యం, న్యాయం అందరికీ సమానంగా  అందాలనీ, ముఖ్యంగా పేదలకు ఉచితంగా దక్కాల్సినవి అవేననీ బోధించేవారు. అంతేకాదు ఆచరణలోనూ పెట్టి చూపించిన మహానుభావుడాయన!

ఒక చిన్న బడి నడిపిన వ్యక్తిగా మాత్రమే కొందరు గుర్తించవచ్చు ! కానీ ఎంత మంది పేద విద్యార్థులకో ఉచితంగా విద్య అందించారు! ఎటువంటి రోగాలూ రాకుండా ముందు జాగ్రత్తగా పరిశుభ్రత పాటించాలని స్వయంగా రోడ్లమీద చెత్తా చెదారం తీసి శుభ్రపరచటం నాకు తెలుసు. అలా శుచీ, శుభ్రత గురించి పెద్దవాళ్ళకూ పాఠాలు చెప్పగలిగారు. వెనకబడిన కులాల వాళ్ళంటూ ఉండే గూడేనికి వెళ్ళి ఆ పని చేస్తుంటే... సాటి వాళ్ళ నుండి ఎలాంటి విమర్శలు ఎదుర్కొన్నారో స్వయంగా నేను చూసా కూడా!

ఎవరైనా వచ్చి అన్యాయం జరిగిందని మొరపెట్టు కుంటే... అన్ని విషయాలూ తెలుసుకుని పరిశీలించి చూసి.. స్వంత డబ్బుతో ఎంత మందిని ఆదుకుని భరోసా కల్పించారో...! తగవులెందుకని దాయాదులకే తన ఆస్తిలోని చాలా భాగం నిస్వార్థంగా అప్పచెప్పేసిన ధీమంతుడు!'' అంటూ వారి గురించి  అలా మా నాన్న చెప్పిన మాటలు నా మనసులో బాగా నాటుకున్నాయి....!

అలా నాన్న తాతగారి గురించి గొప్పగా చెప్పినప్పుడు..... నేను మనసులో ఆనాడే గట్టిగా నిర్ణయించుకున్నాను... 'మంచి పేరు సంపాదించి, మా నాన్నతోనే తాతగారిని గుర్తు చేయగలిగేంత వాడివయ్యావురా' అని అనిపించుకోవాలని...! ఆ తర్వాత ఆ మాటనే మా నాన్నకీ చెప్పాను.

మానాన్న ఆర్థికంగా ఎంత ఎదిగినా ఎంత పేరు ప్రఖ్యాతులు సంపాదించినా... తన గతాన్నీ, తాతగారి పాఠాల్నీ మర్చిపోలేదు! ఎపుడూ మననం చేసుకుంటూనే ఉంటారు. ఊరు సంగతులన్నీ తెలుసుకోవటం... ఊరువాళ్ళందర్నీ గుర్తుచేసుకోవటం జరుగుతూనే ఉంటుంది !

ఈ ఊరుకు వచ్చిన స్కూలు, కాలేజీల వలన ఎంతోమంది బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవటమూ తెలుసు ! చాలామంది విదేశాలకూ వెళ్ళి స్థితిమంతులయ్యారు! వాళ్ళ ఇళ్ళన్నీ అన్ని సౌకర్యాలతో పెద్ద పెద్ద భవంతులుగా మారాయి. అలా ఎన్నో సౌకర్యాలు వచ్చిపడి... ఈ ఊరుకు 'శ్రీపురం' అనే పేరు సార్థక నామధేయమైంది!

అయితే... ఊరుకు సిరిసంపదలు, సకల సౌకర్యాలూ సమకూడినా గానీ మా నాన్న కోరుకున్న మార్పు మాత్రం రాలేదని దిగులు పడటం నేను గమనించాను! వెనక కులాల వాళ్ళు ఇంకా చిన్నచూపుతో ఊరుకు దూరంగా గూడెంలోనే ఉండిపోవటం మా నాన్నకు చాలా విస్మయం, బాధ కలిగించింది. కులాలనేవి కేవలం అలవాట్లు, ఆచారాలబట్టి ఏర్పరచ బడ్డాయని అందరూ అనుకునే విషయమే కదా..! స్వంత వాళ్ళని అభిమానించటం, కులాభిమానం ఉండటాన్ని ఎవరూ తప్పు పట్టలేరు! అయితే ఎక్కువ తక్కువలంటూ కులాల పేరిట కొంతమందిని దూరం పెట్టి చిన్న చూపు చూడటం

మాత్రం చాలా అన్యాయం ! కులాల దురభిమానం నశించి ... మనుష్యులమందరం ఒకటేననే సమతా భావం పెరగాలనేది మా నాన్న ఆశ, ఆశయం!

నేను పరిస్థితులను బట్టి బయటకు వచ్చినపుడు... మన ఊరులో వెనకబడిన వర్గం, కులం అంటూ ఉండకుండా ఊరుకు మంచి పేరును తీసుకువస్తానని చెప్పాను! ఇది సాధించాలంటే... కొన్నాళ్ళు పాఠం బోధించినట్లుగా చేయటం కాకుండా కులాల ఆధిపత్యం పోవటానికి ... ఇక్కడవాళ్ళందరితో... ఈ ఊరులోనే కలిసి మెలిసి కొన్నేళ్ళు ఉండి.. అది సాధించగలగాలి !

'కష్టజీవులదే పై చేయి కావాలి .. శ్రమ జీవనానికి గౌరవం దక్కాలి!' ఇదే మా నాన్న కోరిక ! ఇది నెరవేర్చి... మా తాతగారికి తగిన మనవడుగా గుర్తింపు పొందగలగాలనేదే నా కోరిక! అందుకే ఈ ఊరుకు వచ్చాను!

'ఆనందమే జీవిత పరమావధీ... పరోపకారమే వ్రతవిధీ..' అని తాత గారు తరచూ చెప్పటంతో మా నాన్నకూ ఆ సూక్తి అంటే తనకూ చాలా ఇష్టమని చెప్పారు. అందుకే... మరో ఆలోచన లేకుండా దానిని రాయించి... ఆరుగుపైన అందరికీ కనబడేట్లుగా వ్రేలాడదీసాను! సాయం చేయటం ద్వారా పొందగల విలువైన ఆనందాన్నే ఎవరైనా కోరుకోవలసినది! ఎందరో మతప్రవక్తలూ, మహనీయులూ బోధించిందీ ఇదే..! ఇది సాధించగల గ్రామం నిజంగా ఆనంద నందనమే..! అందుకే... ఈ శ్రీపురం కూడా నందనవనానికి మారుపేరుగా నిలవాలనీ, అలా పేరుగాంచాలనీ, అందుకు కృషి చేయాలనీ అనుకున్నాను!

సూర్యం... నువ్వు 'శ్రీపురానికి దారి' అని రాయబడిన బోర్డును మీ పొలంలో కొత్తవాళ్ళ అందరికీ దారి తెలిసేలా నిలిపి ఉంచుతానని చెప్పి ... ముందుగా నాకే

చూపించావు కదా, పైన 'నందనవనం' అనీ కొంచెం మధ్యలో చిన్న అక్షరాలతో 'అనబడే' అనే మాటను రాయటానికి ఆ బోర్డులో స్థలం సరిపోతుందా లేదా అని సరిచూస్తుంటే.... నువ్వు.... ఎందుకూ, ఏమిటీ అనడిగావు. తర్వాత చెబుతాలే అనేసానా... నువ్వడిగావని నేననుకున్నది ఇంకా సాధించకముందే.. ఇపుడు నీకు చెప్పేసాను..!'' అంటూ ఆయన చెప్పటం ముగించాడు.

ఆశ్చర్యంగా వింటోన్న.. సూర్యం తెప్పరిల్లినట్లుగా చూస్తూ ''అయితే 'నందనవనం అనబడే శ్రీపురానికి దారి....' అని ఉంటుందన్న మాట... అంతే కదండీ..?'' అనడిగాడు.

''అవును.. అంతే... ఇపుడు నీ సందేహం తీరినట్లే కదూ..? నువ్వడిగావని మాత్రమే కాదు, నేను తలపెట్టిన ఈ పనిలో నీ సాయం కూడా అవసరమౌతుందేమోననిపించి... నీకూ తెలియజేశానిదంతా...!''

ఆయన మాటలకు సూర్యం మొహం విప్పారింది. ''ఇలాంటి పనిలో.... ఉడతా సాయంగా ఏ చిన్న పని అయినా చేయగల భాగ్యం లభిస్తే... అది నా అదృష్టమనే భావిస్తానండీ.....!'' అన్నాడు వినయంగా.

''సరే... ఇప్పటికే కొంచెం ఆలశ్యం అయింది.... నువ్వు నా మాట ప్రకారం కాలేజీకి రేపు బయలుదేరు...'' అంటూ ఆయన లేచి నిలబడే సరికి..... సూర్యం కూడా తలవూపుతూ నమస్కరించి వెనుదిరిగాడు.

* * *